ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
శుక్రవారం 9 ఆగస్టు 2024




నల్లమలలో చెంచుల పెచ్చెర్వు గూడెం

గిరిజనమే మూలం

సంప్రదాయ నృత్యం చేస్తున్న గిరిజనులు



నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

- వైవిధ్యం.. చెంచుల జీవితం..!
- నల్లమల పుణ్యక్షేత్రాల్లో చెంచుల మూలాలు
- పాల్కురికి సోమనాథుడి రచనల్లో ప్రస్థావన



ఆత్మకూరు, ఆగస్టు 8:

ఆదివాసులు మానవాళికి ఆద్యులు. అడవికి, ప్రకృతికి, సహజ వనరులకు రక్షకులు. సంపద, సరుకులు కేంద్రంగా కొనసాగుతున్న మన సమాజానికి భిన్నంగా శ్రమ కేంద్రంగా ఆదివాసులు జీవిస్తున్నారు. అయితే మార్కెట్ విస్తరణ, ప్రభుత్వ రాజకీయార్థిక విధానాలు, పాలనా పద్ధతుల వల్ల ఆదివాసుల ఉనికి సంక్షోభంలో పడిపోయింది. ఆదివాసులు అడవి నుంచి విస్తాపనకు గుర్త్రె, చివరికి అంతరించి పోయే దుస్థితి ఏర్పడింది. అత్యంత ప్రాచీన సాంస్కృతిక జీవన మూలాలు ఉన్న ఆదివాసులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. నల్లమలలోని చెంచులు ఆదిమ గిరిజన తెగల్లో ద్రావిడజాతికి చెందిన ఒకానొక తెగ. చెంచుల చరిత్ర, సంస్కృతి, ఆచార వ్యవహారాలపై చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. 17వ శతాబ్దంలోనే ఫెరిస్టా అనే చరిత్రకారుడు చెంచుల జీవన ప్రమాణాలపై పలు వివరాలు వెల్లడించాడు. అయితే 1943లో హెమన్‌డార్ఫ్ రాసిన పుస్తకం చెంచుల మీద ప్రామాణికమైనది. దేశంలో అత్యంత వెనకబడిన చెంచుల జనాభా నానాటికీ క్షీణిస్తున్నది. చెంచు జాతిని సంరక్షించాలని ప్రభుత్వాలు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థను నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

అడవుల్లో చెంచుల నివాసాలను గూడేలని, పెంటలని అంటారు. దోమలపెంట, సున్నిపెంట, చదరంపెంట తదితర పెంటలు నల్లమలలో ఉన్నాయి. పెద్దపెంటలను గూడేలు అంటారు. గూడేలలో వ్యవసాయం కనిపిస్తే, పెంటల్లో ఇంకా అటవీ ఫలసాయ సేకరణ, వేటస్థాయిలోనే చెంచులు ఉన్నారు. చెంచుల మాతృభాష తెలుగు అయినప్పటికీ తమదైన శైలిలో యాస, మాండలికం మిళితమై ఉంటాయి. అయితే చెంచులకు బయటి ప్రపంచంతో ఎన్నోతరాలుగా పరిచయాలు ఉండటంతో వారు ఇతరులతో సులభంగానే సంభాషిస్తారు. కాగా ఈ పెంటల్లో నేటికి అనారోగ్యం, పోషకాహారలోపం, ఆర్థిక వెనుకబాటుతనం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. అయితే వారి సాంస్కృతిక వారసత్వం మాత్రం ఉన్నతస్థాయిలో వుందని చారిత్రక సాక్ష్యాలు తెలుపుతున్నాయి.

చెంచుల్లో భిన్నమైన ఆచారాలు

చెంచులది పితృస్వామిక వ్యవస్థ. కట్నకానుకలకు బదులు ఆడపిల్లకు వోలి ఇచ్చే ఆచారం వుంది. పెండ్లిలో ఆర్భాటాలు కూడా కనిపించవు. ఉన్నంతలో ఆడుతూ పాడుతూ సంతోషకంగా గడుపుతారు. ఇంటిపేరు, గోత్రం పరిగణలోకి తీసుకుని ఆరుబయటే వివాహాలు చేసుకుంటారు. చెంచుల్లో 26 గోత్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. అర్తి(అరటి), నిమ్మల(నిమ్మచెట్టు), కుడుముల (వంటకం), పులచెర్ల (పెద్దపులి), ఉడతల (ఉడత), తోకల(తోక), మేకల (మేక), ఉత్తలూరి లాంటి ఇంటిపేర్లు ఉన్నాయి. అలాగే చెంచుల ఆచారాలు, సంప్రదాయాలు వారి ఆదిమ సంస్కృతికి చిహ్నంగా వుంటాయి. వారు ప్రకృతి దగ్గరగా జీవించడం వల్ల వారి ఆచారాలు కూడా ప్రకృతిలో ముడిపడివుంటాయి. పెళ్లి, చావు వంటి సందర్భాల్లో చెంచులు తమ తెగ ఆచారాలను పాటిస్తారు. ఇదిలావుంటే చెంచుగూడేలకు తమ సరిహద్దులోని అటవీ ప్రాంతంలో ఫలసాయం ఆ గూడేల వారికే హక్కు ఉండేది. అయితే బంకచెట్లు, చింతచెట్లు తదితర ఫలయాసాన్ని ఇచ్చే చెట్లన్నీ సామాజిక ఆస్తి కింద అనుభవిస్తారు. చెంచుల్లో కుల పంచాయతీ బలంగా వుంటుంది. సామాజిక జీవితానికి సంబంధించిన అన్ని విషయాల్లో పెద్దల జోక్యం వుంటుంది. కులాచారాలు పాటించని వారికి జరిమానాలు విధిస్తారు. కొన్నిసార్లు వెలి వేస్తారు.

చెంచుల్లో రెండు తెగలు

చెంచుల్లో ముఖ్యంగా రెండు తెగలవారు ఉన్నారు. వారు అడవి చెంచులు, ఊరచెంచులు. నల్లమల అడవుల్లో కృష్ణానదికి ఇరువైపుల ఉండే కొండ, లోయ ప్రాంతాల్లో నివసించే చెంచులను అడవిచెంచులు లేదా కొండచెంచులు అని పిలుస్తారు. ఊర చెంచులు అనేవారు గ్రామాల్లో తిరుగుతూ.. భిక్షాటన చేస్తారు. వీరినే కృష్ణ చెంచులు లేక చెంచు దాసరులు అంటారు. ఆధునిక కాలంలో అడవిచెంచులు, ఊర చెంచులలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పూర్తిగా అడవుల్లో నివసించేవారి పరిస్థితి ఇప్పటికీ దయనీయంగానే వుంది. అయితే అడవి చెంచులు మాత్రం ప్రత్యేకంగా కనిపిస్తారు. బక్కపలచగా, పొట్టిగా, చెదిరిన ఉంగరాల జట్టు, అమాయకపు ముఖం, సప్పిడి ముక్కు, నలుపు లేక రాగిరంగు చర్మంతో ప్రస్ఫుటమైన ఆకారంలో చెంచులు వుంటారు. వీరి కుటుంబ వ్యవస్థ కూడా వీరి జీవనానికి అనుగుణంగా వుంటుంది. ఎప్పుడూ అడవిలో సంచరిస్తూ అటవీ ఫలసేకరణ, చిన్న జంతువుల వేట లాంటి పనులు వీరి జీవన విధానంలో భాగాలు. కాబట్టి వీరివి చిన్న కుటుంబాలని చెప్పవచ్చు. భార్యాభర్తలు, చిన్నపిల్లలు, సాయంగా కుక్కతో సంచరిస్తుంటారు.

ప్రతి ఏటా ఆగస్టు 9న

ప్రపంచవ్యాప్తంగా ఆదిమ జాతులు అంతరించిపోకుండా సంరక్షించాలన్న తలంపుతో ఐక్యరాజ్యసమితి 1994లో ఆగస్టు 9వ తేదిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా 1997లో గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులను ప్రసాదించేందుకు ప్రపంచదేశాల ప్రతినిధులతో తీర్మానానికి ఆహ్వానించింది. సుమారు 143 ఐరాస సభ్యదేశాలు ఈ ఓటింగ్‌లో పాల్గొనగా 125 దేశాల ప్రతినిధులు తీర్మానాన్ని ఆమోదించారు. అప్పటి నుంచి గిరిజనుల హక్కులు, వారికి ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీల గురించి అవగాహన కల్పించేందుకు ప్రతిఏటా ఆగస్టు 9వ తేదిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం జరపడం ఆనవాయితీగా వస్తోంది.

నల్లమలలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో చెంచుల మూలాలు

చెంచుల ఆచారాలు చాలా సరళంగా ఉంటాయి. మైసమ్మ, యాదమ్మ, గురవయ్యలను వారు పూజించేవారు. నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం, అహోబిలం దేవాలయాల స్థలపురాణాల్లో చెంచుల గురించి ఎన్నో వివరాలు ప్రస్తావించబడ్డాయి. శ్రీశైలంలోని మల్లికార్జునుడి అసలు పేరు మల్లన్న. మల అంటే కొండ, అన్న అనేది పెద్దలను గౌరవంగా పిలవడానికి వాడే పదం. అంటే కొండ మీద ఉన్న అన్న అని అర్థం. అందుకే చెంచు మల్లన్ను మొట్టమొదటి దేవుడుగా విశ్వసిస్తారు. మల్లన్నను సంస్కృతీకరించిన రూపమే మల్లికార్జునుడు అని అంటారు. శ్రీశైలంలో ఉన్న వృద్ధ మల్లికార్జునుడే చెంచు మల్లన్న అని కొందరి నమ్మకం. అతడి రూపం చెంచు దేవతల్లాగే ఒక రాయి ఆకారంలో వుంటుంది. తొలుత చెంచులే శ్రీశైలంలో పూజారులుగా ఉండేవారు. అయితే కాలక్రమంలో మల్లికార్జునుడి ఆలయంలో శైవపూజారులు, భ్రమరాంబ దేవాలయంలో వైష్ణవ పూజారులు వచ్చి చెంచులను బయటికి పంపారని ప్రచారంలో వుంది. ఆ తర్వాత శ్రీశైలంలో జరిగే ఉత్సవాల్లో రథాన్ని లాగడం, దివిటీలు మోయ్యడం, శివుడి పూజలో ఉపయోగించే మారేడు ఆకులను తీసుకురావడం వంటి పనులకు చెంచులను ఉపయోగించేవారని తెలిసింది. శ్రీశైలంకు రోడ్డు లేని రోజుల్లో భక్తులు అడవి మార్గంలో వస్తున్నప్పుడు చెంచులే వారికి సహాయపడేవారని బ్రిటీష్ రికార్డుల్లో ఉంది. నేటికి శ్రీశైలంలో చెంచు సంప్రదాయాలతో సంక్రాంతి పర్వదినం రోజున మల్లన్నకు కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. అహోబిలం క్షేత్ర చరిత్రలో కూడా చెంచుల ప్రస్తావన వుంది. హిరణ్యకశిపుని వధించిన తర్వాత ఉగ్రనరసింహుడు ఇంకా ఉద్రేకంతో ఊగిపోతూ అడవిలో సంచరిస్తుంటే లక్ష్మీదేవి చెంచిత రూపంలో వచ్చి అతడిని శాంతిపజేసిందని ఒక విశ్వాసం. తొలుత అహోబిలంలో కూడా అర్చకులుగా చెంచులే వ్యవహరించేవారని అంటారు. చెంచు జాతి ప్రస్తావన పాల్కురికి సోమనాధుడు రాసిన పండితారాధ్య చరిత్రలో కనిపిస్తుంది. చెంచులను ధర్మాత్ములని ఆయన పేర్కొన్నారు.


నల్లమలలో చెంచుల పూర్వీకులు (ఫైల్)


సంప్రదాయ ఆటలాడుతున్న గిరిజనులు

జిల్లా ప్రధాన న్యాయాధికారిగా కబర్ధి


కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారికి పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (లీగల్), ఆగస్టు 8: కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారిగా జి. కబర్ధి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత వారంలో పదవి విరమణ చేసిన జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసరావు స్థానంలో ఇన్‌చార్జి న్యాయాధికారిగా కర్నూలు ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి జి. ప్రతిభాదేవి బాధ్యతలు నిర్వహించారు. ఆమె నుంచి నూతన జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలువురు న్యాయాధికారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఎస్పీ జి. బిందు మాధవ్ నూతన ప్రధాన న్యాయాధికారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ అందరి సహకారంతో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందిస్తానని అన్నారు. అంతకుముందు స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం నూతన ప్రధాన న్యాయాధికారిని అభినందనలు తెలిపారు.

ఎంపీడీఓల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 8: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీఓలను తిరిగి వారు గతంలో పని చేసిన ప్రాంతాలకే పంపాలని పీఆర్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేసినట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈ ఏడాది జనవరి 30న ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు 33 మంది, కడపకు ఏడుగురు (మొత్తం 40 మంది) ఎంపీడీఓలు ఎన్నికల విధులు నిర్వహించేందుకు బదిలీ అయ్యారన్నారు. వీరి స్థానంలో అనంతపురం జిల్లా నుంచి 23 మంది, కడప జిల్లా నుంచి 16 మంది (మొత్తం 39 మంది) ఎంపీడీఓలు కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణకు వచ్చి ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరందరినీ గతంలో పని చేసిన జిల్లాలకు పంపేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రెండు, మూడు రోజుల్లో ఇక్కడ పని చేసిన ఇతర జిల్లాలకు చెందిన ఎంపీడీఓలు గతంలో వారు పని చేసిన ప్రాంతాలకు వెళ్తారని, వారి స్థానంలో ఇతర జిల్లాలకు వెళ్లిన ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీడీఓలు బాధ్యతలు చేపడతారని తెలిపారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద


శ్రీశైలం డ్యామ్

శ్రీశైలం, ఆగస్టు 8: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం గురువారం కూడా కొనసాగింది. జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం కొనసాగడంతో డ్యామ్ అధికారులు జలాశయం నుంచి 10 క్రస్టుగేట్లును 12 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 3,13,182 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 53,748 క్యూసెక్కులు మొత్తం 3,66,930 వరద ప్రవాహం వస్తోంది. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 3,54,761 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 882.50 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 202.0439 టీఎంసీలుగా నమోదైంది.

ప్రశాంతంగా స్కూల్ కమిటీ ఎన్నికలు

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 8: జిల్లాలో పాఠశాల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఈఓ సుధాకర్ రెడ్డి గురువారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,399 పాఠశాలలకుగాను 1,381 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. 18 పాఠశాలల్లో కోరం లేని కారణంగా వాయిదా వేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మల్యాల నుంచి నీటి విడుదల

మల్యాలలోని హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. డీఈ చిన్నయ్య మాట్లాడుతూ హంద్రీనీవా కాలువకు అక్కడక్కడా మరమ్మత్తులు పూర్తి చేశామన్నారు. దీంతో గురువారం రెండు పంపుల ద్వారా 1,011 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు.

- నందికొట్కూరు రూరల్.


మల్యాల హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం నుంచి రెండు పంపుల ద్వారా విడుదలవుతున్న కృష్ణా జలాలు

గోరుకల్లు నుంచి నీటి విడుదల


జీఎన్ఎస్ఎస్ నుంచి అవుకు రిజర్వాయర్‌కు చేరుతున్న నీరు

అవుకు రిజర్వాయర్‌కు చేరుతున్న వరద

అవుకు, ఆగస్టు 8 : గోరుకల్లు రిజర్వాయర్ నుంచి గాలేరు నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) కెనాల్ ద్వారా అవుకు రిజర్వాయర్‌కు నీరు విడుదల చేసినట్లు ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబు గురువారం తెలిపారు. గోరుకల్లు నుంచి 11 వేల క్యూసెక్కుల నీటిని జీఎన్ఎస్ఎస్ కెనాల్‌కు విడుదల చేయగా ప్రస్తుతం టన్నెల్ రెండు సొరంగాల ద్వారా 6 వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. శుక్రవారం ఉదయానికి 10వేల క్యూసెక్కుల నీరు చేరే అవకాశం ఉంది. అలాగే ఎస్సార్బీసీ కాల్వ నుంచి 660 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు చేరుతుంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.148 టీఎంసీలు కాగా మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో నీరు చేరే అవకాశం ఉంది. రిజర్వాయర్ నుంచి 12వ బ్లాక్ (సంగపట్నం) కాల్వ ద్వారా నీరు ఆయకట్టుకు చేరుతుంది. రిజర్వాయర్‌లో 2.50 టీఎంసీలకు పైగా నీరు చేరితే కడప జిల్లాకు జీఎన్ఎస్ఎస్ ద్వారా నీరు తరలించే అవకాశం ఉందని ఈఈ సురేష్‌బాబు తెలిపారు.

కదులుతున్న అవినీతి డొంక

- విచారణకు ఆదేశించిన ఆదోని సబ్ కలెక్టర్
- తల పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హొళగుంద ఆగస్టు 8: హొళగుంద తహసీల్దార్ కార్యాలయం అవినీతి అడ్డాగా మారిందని ఈ నెల ఏడో తేదీ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అవినీతి రాబందు అనే కథనంపై కలెక్టర్ రంజిత్ బాషా స్పందించారు. ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మను విచారించాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులకు గురువారం ఆదేశాలు అందాయి. ఆ అధికారిపై వచ్చిన ఆరోపణలు నిజమని తెలిసినా జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆయనను కాపాడేందుకుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా అవినీతికి పాల్పడిన ఉన్నతాధికారిపై చర్యలు తీసుకుంటారా? లేదా అనే సందేహం మండల ప్రజల్లో నెలకొంది.

మరో ఆరు మండలాలకు తహసీల్దార్లు

నంద్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా మండలాలకు తహసీల్దార్లను నియమిస్తూ కలెక్టర్ రాజకుమారి గణియా ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు మండలాలకు రెగ్యులర్ తహసీల్దార్లను నియమించగా, రెండు మండలాలకు డిప్యూటీ తహసీల్దార్లకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరు కాకుండా మరికొంత మంది పోస్టింగుల కోసం వేచి చూస్తున్నారు. వీరికి ఒకటి రెండ్రోజుల్లో ఆయా మండలాల్లో స్థానాలు కేటాయించే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్, ఆర్డీవో ఆఫీసులు, ఆయా మండలాలకు 22 మంది తహశీల్దార్లకు స్థానాలు కేటాయించిన సంగతి తెలిసిందే. షేక్ మోహిద్దీన్‌ను గోస్పాడుకు, టి.అంజనాదేవిని ఆర్డీవో కార్యాలయానికి (ఆత్మకూరు), షేక్ హసీనా బీ ఆర్డీవో కార్యాలయానికి (నంద్యాల), జి. సుభద్రమ్మ, పాములుపాడుకు, పి.సత్యదీప్ డోన్‌కు(ఎఫ్ఏసీ), పి. అనిల్ కుమార్ సంజామల(ఎఫ్ఏసీ)కు నియమితులయ్యారు.

మహానందిలో జిల్లా ప్రధాన న్యాయాధికారి



జిల్లా జడ్జికి స్వామి వారి ప్రసాదాలు అందజేస్తున్న వేదపండితులు

మహానంది, ఆగస్టు 8: మహానంది ఆలయంలో గురువారం కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద ఏఈఓ ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభి షేకార్చన పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వేద పండితులు సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున ఉన్నారు.

20న నులి పురుగుల మాత్రల పంపిణీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్

కర్నూలు(హస్పిటల్), ఆగస్టు 8: ఈ నెల 20వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ ఐ.హేమలత తెలిపారు. గురువారం నగరంలోని వీకర్ సెక్షన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగు తున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతుల అపరిశుభ్రతతోనే అనేక పురుగులు పిల్లల కడుపులోకి చేరుతాయనీ, ఇవి నులిపురుగుల, ఇతర పురుగులు పొట్టలో వృద్ధి చెందుతా యన్నారు. కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థి భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. నులిపురుగుల నివారణ మాత్రలు 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలమందు మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాలిక్‌ఖాన్, సచివాలయ ఆరోగ్యకార్యకర్త సత్య సులోచన, పాపమ్మ, ఆషా కార్యకర్తలు, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

1,3 సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఆగస్టు 8: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జన వరిలో నిర్వహించిన 1,3 సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను వర్సిటీ అధికారులు గురువారం విడుదల చేశారు. 1వ సెమిస్టర్‌లో 1609కి 261 మంది, 3వ సెమిస్టర్‌లో 2,555 మంది హాజరయ్యారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు మాజీ సీఎం జగన్ సీతారామపురానికి రాక

మహానంది, ఆగస్టు 8: మహానంది మండలం సీతారామపురం గ్రామానికి శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నట్లు వైసీపీ నాయకులు తెలిపారు. ఈనెల 3వ తేదీన సీతారామపురంలో వైసీపీ కార్యకర్త సుబ్బరాయుడు దారుణహత్యకు గురయ్యాడు. దీంతో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ సీఎం జగన్ వస్తున్నారు. ఉదయం 9 గంటలకు ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు ఆయన చేరుకుని రోడ్డు మార్గం ద్వారా నంద్యాల మీదుగా మహానంది మండలం సీతారామపురం గ్రామానికి 11 గంటలకు చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చుతారు. అనంతరం మీడియాతో మాట్లాడుతారని వైసీపీ నాయకులు తెలిపారు.

పశుగణన పూర్తి చేయండి

- ఇన్‌చార్జి జేసీ డీఆర్వో మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 8: దేశంలో పశుగణన కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందని కర్నూలు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో మధుసూదన్‌రావు ఆదేశించారు. 21వ పశుగణన కార్యక్రమం కర్నూలు జిల్లాలో ప్రారంభిస్తున్న సందర్భంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని గురువారం కర్నూలు నగరంలోని బహుళార్థ సాధక ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మధుసూదన్‌రావు మాట్లాడుతూ పశుగణన సక్రమంగా చేపట్టేందుకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ జేడీ గుడివాడ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశం అంతటా ఈ ఏడాది సెప్టెంబరు 1వ తేదీ నుంచి డిసెంబరు వరకు ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్స్‌కు వెళ్లి పశు సంపద వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టరు డా. ప్రసన్నబాబు, ఇతర డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, లైవ్ స్టాక్ సెన్సెస్ నోడల్ ఆఫీసర్లు, జిల్లా పశుసంవర్థక శాఖ సిబ్బంది ఉన్నారు.

సెప్టెంబరు 30లోగా పురోగతి సాధించాలి

- వెనుకబడిన మండలాల అభివృద్ధి
- నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 8: నిర్దేశించిన ప్రాజెక్టుల్లో సెప్టెంబరు 30లోపు పురోగతి సాధించాలని నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం కలెక్టర్‌కు సూచించారు. గురువారం ఢిల్లీ నీతి అయోగ్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని రాష్ట్రాల జిల్లాల కలెక్టర్లతో ఆస్పిరేషనల్ బ్లాక్‌కు సంబంధించిన వివిధ అంశాలపై నీతి అయోగ్ సీఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సీఈవో మాట్లాడుతూ భారతదేశంలోని వెనుకబడిన మండలాలను అభివృద్ధి చేసేందుకు 500 మండలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం ఆస్పిరేషనల్ బ్లాక్స్ అనే కార్యక్రమం నీతి అయోగ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ మండలాల్లో అభివృద్ధి చేయడం కోసం 39 ఇండికేటర్స్‌ను ప్రవేశపెట్టి వంద శాతం పురోగతి సాధించాలనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అందుకు 39 ఇండికేటర్స్‌లో మొదటిగా 6 ఇండికేటర్స్‌ను ఎంపిక చేసి సంపూర్ణత అభియాన్ అనే కార్యక్రమం ద్వారా (యాంటినేటల్ కేర్) 3 నెలల్లోపు ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి వారిని రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. డయాబెటీస్, హైపర్‌టెన్షన్‌ను పూర్తి స్థాయిలో స్క్రీనింగ్ చేయాలన్నారు. ఐసీడీఎస్‌కు గర్భిణీ స్త్రీలకు సంబంధించి వంద శాతం టేక్ హోం రేషన్ అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో సాయిల్ హెల్త్ కార్డ్స్ అందజేయాలన్నారు. డీఆర్‌డీఏకు సంబంధించి ఉన్న గ్రూపులకు సంబంధించి అర్హులైన వారికి రివాల్వింగ్ ఫండ్స్ అందజేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్‌బాషా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సీపీవో హిమప్రభాకర్ రాజు, డీఎంహెచ్‌వో భాస్కర్, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ దీక్ష

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ మంజూరు చేయని డిపో మేనేజర్
- వేధింపులకు గురి చేస్తున్నాడని ఆవేదన



దీక్ష చేస్తున్న రిటైర్డ్ డ్రైవర్ హయత్ సాహెబ్

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 8: ఆర్టీసీలో ఓ చిరుద్యోగి. రిటైర్ అయ్యాక రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా డిపో మేనేజర్ వేధిస్తున్నాడు. ఆదోని ఆర్టీసీ డిపో ముందు రిటైర్డ్ డ్రైవర్ ఎం.దాదాహయత్ సెహెబ్ (407037) డిపో మేనేజర్ ఎండీ రఫీ వేధింపులకు నిరసనగా గురువారం దీక్ష చేపట్టాడు. ఆయనతో పాటు మరో ఆరుగురు జూన్ 30న రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి వారికి ఒక పైసా కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ మంజూరు చేయలేదు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అయిన రోజే కొంత డబ్బు చెక్కు రూ పంలో ఇస్తారు. అయితే తమ డిపోలో మేనేజర్ కక్ష సాధింపుగా ఒక్కపైసా కూడా ఇవ్వకుండానే తమను రిటైర్ చేశారని ఆయన వీరు ఆరోపించారు. తమకు రావలసిన ప్రావిడెంట్ ఫండ్స్ (పీఎస్), గ్రాడ్యుటీ బెనిఫిట్స్‌తో పాటు ఇతర బకాయిలను మంజూరు చేయ కుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆయన ఆరోపిం చారు. మూడు నెలలగా బకాయిలు చెల్లించకుండా, తమకు వచ్చే కొద్దిపాటి పెన్షన్ కూడా మంజూరు చేయకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని కన్నీరు కార్చారు. డాక్యుమెంట్లను కార్యాలయంలో సమర్పించినప్పటికీ డిపో మేనేజర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుం డా వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్ఎం కార్యాలయం చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌కు, ఆర్ఎంకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. రాష్ట్రంలో అన్ని డిపోలలో రిటైర్ అయిన వారికి వెంటనే రిటైర్మెంట్ బకాయిలు ఇస్తున్నారన్నారు. ఆదోని డిపోలో మేనేజర్ రఫీ కండక్టర్లను డ్రైవర్లను డ్యూటీలు 12 నుంచి 14 గంటలకు పైగా పని చేయించుకోవడమే కాకుండా అనారోగ్యంగా ఉన్నా సెలవు మంజూరు చేయకుండా వేధిస్తున్నారన్నారు. రిటైర్మెంట్ బకాయిలు చెల్లించకపోతే 12వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దీక్ష చేపట్టారు.

దూరవిద్యలో పది, ఇంటర్ ప్రవేశాలు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 8: 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య విధానం) పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవా లని ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో మధుసూదన్‌రావు సూచించారు. గురువారం డీఆర్వో కార్యాలయంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సార్వత్రిక విద్య ఎంతో మందికి ఉపయోగపడు తుందన్నారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్త చంద్రభూషణ్‌రావు మాట్లాడుతూ ఎలాంటి విద్యార్హత లేకుండా 14 సంవత్సరాలు నిండిన వారు పదవ తరగతికి, పదవ తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్ కోర్సులో చేరడానికి అర్హులు అన్నారు. ఈ నెల 28వ తేదీలోపు ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.200 అదనపు రుసుంతో సెప్టెంబరు 4 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. పదవ తరగతిలో ప్రవేశం కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.1300, ఇంటర్మీడియట్ వారికి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, అడ్మిషన్ ఫీజు రూ.1400 అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మమ్మ, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, డీపీవో నాగరాజు నాయుడు జిల్లా లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్యశాఖ డెమో చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏ ముఖం పెట్టుకొని వస్తున్నావ్..?

- సలాం కుటుంబంపై ఎందుకు స్పందించలేదు?
- జగన్‌పై మండిపడ్డ టీడీపీ నేత సోమిశెట్టి



కర్నూలు(అర్బన్), ఆగస్టు 8: 'ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత తగాదాలతో హత్యకు గురైన వ్యక్తి కుటుంబానికి తెలుగుదేశం పార్టీకి ఆపాదిస్తున్నావ్.. సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకున్నప్పుడు నంద్యాల గుర్తుకు రాలేదా? ఏమొహం పెట్టుకుని వస్తున్నావ్.' అంటూ మాజీ సీఎం జగన్‌పై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మండిపడ్డారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీపాలనలో వేలాదిమంది వేధింపులకు గురై బలయ్యారన్నారు. నంద్యాల పట్టణంలో అబ్దుల్ సలాం కుటుంబం వైసీపీ నాయకుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు ఆనాడు స్పందించలేదని జగన్‌ను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 36 హత్యలు జరిగాయంటూ గగ్గోలు పెడతుఉన్న జగన్.. వారి జాబితా ఎందుకు ఇవ్వలేకపోతున్నాడని ప్రశ్నించారు. గ్లోబల్ ప్రచారాలతో ఇంకెంతకాలం ప్రజలను మభ్యపెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా వేధించి, చనిపోవడానికి కారణమైంది వైసీపీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. గులకరాయి, కోడికత్తి డ్రామాలను తిరస్కరించిన రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని తిప్పికొట్టారన్నారు. ఘోర పరాభవం ఎదురైనా వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నాయకుల్లో ఏమాత్రం మార్పు రాలేదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణ, నగర కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీవో రద్దుకు కృషి చేయండి..

- రాయలసీమలో కరువు, వలసలను నిర్మూలించండి
- మంత్రులకు విజ్ఞప్తి చేసిన రాయలసీమ సాగునీటి సాధన సమితి



నీటి అవగాహనే రాయలసీమకు రక్ష పుస్తకాలను మంత్రులకు అందజేస్తున్న సాగునీటి సాధన సమితి నాయకులు

నంద్యాల టౌన్, ఆగస్టు 8 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 6, 2023న తీసుకొని వచ్చిన చీకటి జీవో రద్దు కోసం మంత్రులు కృషి చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. గత రెండు రోజుల్లో వివిధ సమయాల్లో అమరావతిలో జమ్మలమడుగు శాసన సభ్యుడు ఆదినారాయణరెడ్డితో కలిసి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిలను వెలగపూడి సెక్రటేరియట్‌లో దశరథరామిరెడ్డి కలిశారు. కృష్ణా నది వరదతో శ్రీశైలం రిజర్వాయర్ నిండినా రాయలసీమకు ు మళ్లించడంలో ఉన్న అవాంతరాలను ప్రాజెక్టుల వారిగా మంత్రులకు వివరించారు. హంద్రీ-నీవా, గాలేరు -నగరి, బ్రహ్మసాగర్ ద్వారా తెలుగు గంగకు నీటి తరలింపులలో ఉన్న సమస్యలు, గత ఏడు సంవత్సరాలుగా మరమ్మత్తులు నోచుకోక నిరుపయోగంగా ఉన్న అలగనూరు రిజర్వాయర్, కుంగిన రివిట్మెంట్‌తో గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతులు, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణంపై మంత్రులకు వివరించారు. ఈ పనుల కోసం తక్షణమే నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీరు లభించడానికి ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు, రిజర్వాయర్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టితో ఒక ప్రణాళికను రూపొందించి కరువు, వలసలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ సాగునీటి అంశాలపై తాను రాసిన "నీటి అవగాహనే రాయలసీమకు రక్ష" పుస్తకాన్ని మంత్రి నిమ్మలకు బొజ్జా ఇచ్చారు. ఈ అంశాలపై మంత్రి నిమ్మల సానుకూలంగా స్పందిస్తూ ప్రత్యేక కార్యాచరణతో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జల వనరుల శాఖ (సాగు నీటి) ఈఎన్‌సీ వెంకటే శ్వరరావు, జలవనరుల శాఖ (అంతర్ రాష్ట్ర విభాగం)ఈఎన్‌సీ శ్రీనివాస్‌లను కలిసి రాయలసీమ సాగునీటి సమస్యలపై చర్చించారు.

హత్యకేసులో నిందితులకు రిమాండ్

నంద్యాల క్రైం, ఆగస్టు 8: మహానంది మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన పసుపులేటి సుబ్బరాయుడు హత్య కేసులో నిందితులను గురువారం నంద్యాల కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు నంద్యాల తాలుకా సీఐ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. నిందితుల్లో బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, కొర్రపోలు భరత్‌రెడ్డి అలియాస్ కంటరెడ్డి భరత్‌రెడ్డి, షేక్‌ముజైతుల్లాహ్ అలియాస్ ముజావుద్దీన్, కందుల రామభూపాల్‌రెడ్డి అలియాస్ బుక్కాపురం భూపాల్‌రెడ్డి, దూదేకుల ఖాసిం అలియాస్ పెద్ద ఖాసింలతోపాటు మరో నలుగురు ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 8: ఉమ్మడి జిల్లాలోని మండల కేంద్రాల్లో సర్పంచు లు, గ్రామపంచాయితీ కార్యదర్శులకు మూ డు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయి తీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ ఉంటుం దన్నారు. 12వ తేదీ నుంచి 14 వరకు జరిగే శిక్షణలో శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌తో పాటు గ్రామపంచాయి తీల అభివృ ద్ధిపై చర్చిస్తారన్నారు. ఎంపీ డీఓ, ఈఓపీ ఆర్‌డీలు ఒక్కో బ్యాచ్‌కు 40-50 మంది సభ్యులు ఉండే విధంగా ప్రణాళికలు చేసుకో వాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి సర్పంచు లు, పంచాయితీ కార్యదర్శులు తప్ప కుండా హాజరుకావాలన్నారు.

సిల్వర్ జూబ్లీ హాస్టల్ విద్యార్థులకు ఒక్క రూపాయికే కిలో బియ్యం

జీఓ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 8: సిల్వర్ జూబ్లీ కళాశాలలోని హాస్టల్ విద్యార్థులకు ఒక్క రూపాయికే కిలో బియ్యం సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ.నెం.7ను విడుదల చేసింది. ఇప్పటి వరకు పౌర సరఫరాల శాఖ ద్వారా కిలో బియ్యం రూ.45.50 పైసలకు కొనుగోలు చేయడం జరిగింది. ఈ జీఓ విడుదల వల్ల ఒక్క రూపాయికే కిలో బియ్యం కొనడం వల్ల మిగులుతున్న మొత్తంలో హాస్టల్‌లో ఉన్న సుమారు 706 మంది విద్యార్థులకు మరింత పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేయనున్నారు.

20 మంది ఎస్ఐలు బదిలీ

కర్నూలు, ఆగస్టు 8: కర్నూలు రేంజ్ పరిధిలో 20 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
టి.నరేంద్ర కుమార్ రెడ్డి	వీఆర్, కర్నూలు	పాణ్యం
రామ్మోహన్ రెడ్డి	రేవనూరు	వెలుగోడు
ఎం.జగన్మోహన్	మిద్తూరు	బండిఆత్మకూరు
కే.మమత	మహిళాపీఎస్, కర్నూలు	డోన్
పి.అశోక్	పాణ్యం	బేతంచెర్ల
ఎం.నరేంద్ర కుమార్	ఆన్ రిపాట్రియేషన్,సీఐడీ	డోన్
ఎం.రాజారెడ్డి	వీఆర్ఎస్‌పీ	అవుకు
జి.శరత్ కుమార్ రెడ్డి	డోన్ టౌన్	వీఆర్, నంద్యాల
కె.సురేష్‌బాబు	బుక్కపట్నం (శ్రీసత్యసాయి)	పాములపాడు
ఎం.చంద్రశేఖర్	సింగనమల, అనంతపురం జిల్లా	నందికొట్కూరు
జి.సురేష్‌బాబు	కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా	నందికొట్కూరు
హరిప్రసాద్	కొత్తపల్లి పీఎస్	ఆళ్లగడ్డ రూరల్
బి.చిన్న పీరయ్య	పెద్దతుంబళం	సిరివెళ్ల
పి.రామిరెడ్డి	బనగానపల్లె	రుద్రవరం
యు.వరప్రసాద్	కోయిలకుంట్ల	గడివేముల
హెచ్.ఓబులేసు	వీఆర్, కర్నూలు	వీఆర్, నంద్యాల
బీవీ సుబ్బారెడ్డి	కుప్పం, చిత్తూరు జిల్లా	శ్రీశైలం టూటౌన్
గోపినాథ్	మంత్రాలయం	వీఆర్, నంద్యాల
పి.వెంకటేశ్	మదనపల్లి, అన్నమయ్య జిల్లా	వీఆర్, నంద్యాల
యు.వెంకటప్రసాద్	గాలివీడు, అన్నమయ్య జిల్లా	వీఆర్ నంద్యాల

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐకు తీవ్ర గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 8: ఎమ్మిగనూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ బాలనాయక్‌కు గురువారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. విద్యాకమిటీ ఎన్నికలు జరుగుతుండడంతో బందోబస్తు నిమిత్తం ఏఎస్ఐ బాలనాయక్, కానిస్టేబుల్ సర్వేశ్వరరెడ్డి ఎమ్మిగనూరు నుండి కడివెళ్ల గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరి వెళ్లారు. శ్రీరామ్‌నగర్ దాటి వెళ్తుండగా మాస్‌మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఆటో ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏఎస్ఐ బాలనాయక్ కుడికాలు విరిగిపోయింది. అదేవిధంగా కానిస్టేబుల్ సర్వేశ్వరరెడ్డి కాలుకు స్వల్పగాయమైంది. స్థానికులు ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తర లించగా బాలనాయక్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేశారు. రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

దేవనకొండ, ఆగస్టు 8 : దేవనకొండ టర్నింగ్ వద్ద మీటరు సర్వీసు వైరు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కొత్తపేట గ్రామానికి చెందిన ముల్ల మస్తాన్‌వలి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పొలాల్లో స్ప్రే చేసే యంత్రాల రిపేరీ మెకానిక్‌గా మస్తాన్ పని చేస్తూ దానికి సంబంధించిన దుకాణం నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం దుకాణం ఖాళీ చేశాడు. గురువారం మధ్యాహ్నం అందులో వున్న మీటరు సర్వీసు వైరు తొలగించే క్రమంలో వైరుకు కరెంట్ సప్లయ్ కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గాయపడ్డ మస్తాన్‌ను స్థానికులు కర్నూలుకు తరలించారు.

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌కు జైలు

కర్నూలు(లీగల్), ఆగస్టు 8: స్థానిక నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మహిళపై అత్యాచారయత్నం చేసిన ఆర్మ్‌డ్ రిజర్వుడ్ హెడ్ కానిస్టేబుల్ శోభన్‌బాబుకు ఒక ఏడాది జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ కర్నూలు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోత్స్నా దేవి గురువారం తీర్పు చెప్పారు. స్థానిక రామలింగేశ్వర్ నగర్‌కు చెందిన బాధితురాలు 2019 డిసెంబరు 25న తన ఇంట్లోని చెత్త పడేయడానికి బయటకు వచ్చింది. అదే సమయంలో ప్రస్తుతం నంద్యాలలో పని చేస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వుడ్ హెడ్ కానిస్టేబుల్ శోభన్ బాబు ఆమెపై అత్యాచారం యత్నం చేశాడు. బాధితురాలు కేకలు వేయగా.. ఆమె భర్తతో పాటు ఇరుగు పొరుగు వారు అక్కడకు రావడంతో నిందితుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితునిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఖాదర్‌బాషా వాదించారు.

కోడుమూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని మోసం

- టికెట్ రాక.. డబ్బులు ఇవ్వకపోవడంతో కిడ్నాప్
- పోలీసుల అదుపులో నిందితులు

కర్నూలు, ఆగస్టు 8: కోడుమూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని భారీగా వసూలు చేసి ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండా మొహం చాటేసిన వ్యక్తిని కిడ్నాప్ చేసిన ఘటన కర్నూలు నగరంలో జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా... మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి, శ్రీరామ్‌నగర్‌కు చెందిన ప్రవీణ్ కుషాల్ అనే వ్యక్తిని గురువారం మధ్యాహ్నం కొందరు ఓ ఫార్చునర్ వాహనంలో వచ్చి బలవంతంగా ఎక్కించుకుని వెళ్లారు. దీంతో ప్రవీణ్ కుషాల్ తండ్రి సల్కాపురం రవి హుటాహుటిన పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఈ కేసు దర్యాప్తు ప్రారంభించడంతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నగరంలో పలువురికి తాను వైసీపీ టికెట్లు ఇప్పించాననీ ఇందులో టీవై రామయ్య కూడా ఒకరు అని, ఇలాంటి పెద్దలు ఎందరో తన ద్వారానే టికెట్ పొందారనీ ప్రవీణ్ కుషాల్ ప్రచారం చేసుకున్నాడు. దీనిని నమ్మిన కల్లూరు మండలానికి చెందిన మద్దిలేటి అనే వ్యక్తి కోడుమూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఇప్పించాలని ప్రవీణ్ కుషాల్‌ను కోరాడు. దీంతో రూ.2 కోట్లు పైబడి మద్దిలేటి నుంచి ప్రవీణ్ కుశాల్ వసూలు చేసినట్లు సమాచారం. ఆ తర్వాత ఎమ్మెల్యే టికెట్ మద్దిలేటికి రాలేదు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తానని నమ్మించిన ప్రవీణ్ ఆరు నెలలు కావస్తున్నా డబ్బులు ఇవ్వకుండా మొహం చాటేస్తుండటంతో ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు తెలిసింది. పోలీసులు చాకచక్యంగా నిందితులను అదుపులతో పాటు బాధితుడు ప్రవీణ్‌ను కూడా అదుపులోకి తీసుకుని వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి విషయాలు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించే అవకాశం ఉంది.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

- చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు

కొన్ని చోట్ల స్వల్ప వివాదాలు మినహా ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని పాఠశాలల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. చాలా చోట్ల ఏకగ్రీవాలు కాగా, మరి కొన్ని చోట్ల ఎన్నికలు జరిగాయి. చాలా చోట్ల టీడీపీ సానుభూతిపరులు గెలుపొందారు. వారికి టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.


వేంపెంట పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో సుధాకర్ రెడ్డి

నంద్యాల క్రైం, ఆగస్టు 8: జిల్లాలో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం నంద్యాల పట్టణంలోని పొన్నాపురం కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీలలో ఉన్న పాఠశాలలను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్ర తదితరులు ఉన్నారు.

గోస్పాడు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంఈవో అబ్దుల్ కరీమ్ తెలిపారు. ఎం.కృష్ణాపురంలో కోరం లేని కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు.

శ్రీశైలం: శ్రీశైలం పరిధిలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యా కమిటటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ ఎన్నికల్లో విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొని విద్యా కమిటటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీశైలం సీఐ ప్రసాదరావు, ఎస్ఐ లక్ష్మణరావు బందోబస్తు చేపట్టారు.

వెలుగోడు: వెలుగోడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యాకమిటీ ఎన్నికలు నిర్వహించారు. 31 పాటశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. అన్ని పాఠవాలల్లో టీడీపీ మద్దతుదారులే విజయం సాధించారు. ఆయా కార్యక్రమాలలో ఎంఈవో బ్రహ్మం నాయక్ పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని 47 పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశా యి. గురువారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

మహానంది: మండలంలోని 34 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. మూడు పాఠశాలలకు అనివార్య కారణాల వల్ల అధికారులు ఎన్నికలు నిర్వహించలేదు. బుక్కాపురంలో సీఐ సూర్యమౌళి ఆధ్వర్యంలో పాఠశాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్మకూరు: మండలంలో 41 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 11 ఉన్నత పాఠశాలల చొప్పున మొత్తం 58 పాఠశాలలు ఉన్నాయి. ఎన్నికైన వారితో పాఠశాల ప్రధానోపాధ్యా యులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంఈవో సురేష్ పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలను పర్యవేక్షించారు.

నందికొట్కూరు/నందికొట్కూరు రూరల్: పట్టణంలో ఎన్నికలు జరుగు తున్న ప్రభుత్వ పాఠశాలలను పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. నియోజకవర్గంలో ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర శివానందరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ప్రైమరీ పాఠశాలలు 42, యూపీ స్కూల్లు 3, హైస్కూళ్లు 11 మొత్తం 56 పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. ప్రైమరీ స్కూల్లు 25, యూపీ స్కూల్లు 3, హైస్కూల్లు 3 మొత్తం 31 ఉన్నాయి. పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 17 ప్రైమరీ, 8 హైస్కూళ్లు మొత్తం 25 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. నంద్యాల నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్యను కలిశారు.


నంద్యాలలో ఎన్నికల తీరును పరిశీలిస్తున్న ఎస్పీ

పాములపాడు: పాములపాడు జడ్పీ హైస్కూల్ మినహా మిగతా 37 పాఠశాలలో ఎన్నికలు జరిగాయి. సమస్యాత్మక గ్రామాలలో ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు. వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సరళిని జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి పరిశీలించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని మొత్తం 38 పాఠశాలలలో సీఎంసీ ఎన్నికలు నిర్వహించారు. అందులో 12 పాఠశాలల్లో చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈవో చిన్నమద్దిలేటి తెలిపారు. ఎన్నికైన వ్యక్తులు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిని కలిశారు.

పగిద్యాల: ముచ్చుమర్రి, ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 19 ఎంపీపీ పాఠశాలలో ఏకగ్రీవంగా ఎస్‌ఎంసీ చైర్మన్లు ఎన్నికైనట్లు ఎంఈవో సుబాన్ తెలిపారు. పగిద్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవో చెప్పారు.


అల్లూరులో మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్యను కలిసిన ఎస్‌ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులు

ఎస్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. నెహ్రూనగర్, లక్ష్మాపురంలో టీడీపీలో బైరెడ్డి, మాండ్ర వర్గాల మధ్య పోటీ నెలకొంది. ఎన్నికలలో బాగంగా నెహ్రూనగర్ గ్రామంలో ఇరువర్గాలకు చెందిన(టీడీపీలో బైరెడ్డి, మాండ్ర, వైసీపీ) నాయకులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. తమ వర్గానికి చెందిన వారిని మరోవర్గం వారు తమ ప్రక్కకు పిలువడంతో ఇరువురి మధ్య వివాదం నెలకొంది. ముచ్చుమర్రి ఎస్ఐ గంగయ్య అక్కడికి చేరుకొని ఇరువర్గాలకు చెందిన వారిని అక్కడి నుంచి పంపివేశారు. నెహ్రూనగర్‌లో జరుగుతున్న ఎన్నికల కార్యక్రమాన్ని నందికొట్కూరు రూరల్ సీఐ క్రిష్ణయ్య పరిశీలించారు. ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

కొత్తపల్లి: మండలంలో 43 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. అందులో 40 పాఠశాలలకు ఎన్నికలు జరగ్గా గోకవరం ఎంపీయూపీ పాఠశాలలో మాత్రం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల ఎంఈవో-1 బ్రహ్మం నాయక్, ఎంఈవో-2 ఇనయతుల్లాలు తెలిపారు. కోరం లేక ముసలిమడుగు ఉర్దూ పాఠశాలతో పాటు చిన్నగుమ్మడాపురం పాఠశాలలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. శివపురం గ్రామంలో ఇరువర్గాల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకోవడంతో స్థానిక ఎస్ఐ హరిప్రసాద్ అప్రమత్తమై సమస్యను సర్దుమనిగించారు.

పాణ్యం: మండలంలో 46 పాఠశాలలకు గాను 39 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఏడు పాఠశాలల్లో ఎన్నికలు జరిగినట్లు ఎంఈవో కోటయ్య తెలిపారు. గోరుకల్లు జడ్పీహెచ్‌ఎస్‌ను సమగ్ర శిక్ష ఏఎంఓ అధికారి లలిత, అసిస్టెంట్ ఏఎంఓ యూనస్, ఎంఈవో కోటయ్య పరిశీలించారు.

గడివేముల: మండలంలో 38 పాఠశాలలుండగా కె.బొల్లవరం ప్రాథమిక పాఠశాల, గని, బిలకలగూడూరు ఉర్దూ పాఠశాలల్లో, మంచాలకట్ట స్పెషల్ ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో ఓటింగ్ జరగగా టీడీపీ బలపరిచిన అభ్యర్థులు ఎన్నికయ్యారు. ఆళ్లగడ్డ, వందుట్ల ప్రాథమిక పాఠశాలల్లో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా వేసినట్లు ఎంఈవో విమల వసుంధర దేవి తెలిపారు. మిగిలిన పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యామన్నారు.

మల్లన్న సన్నిధిలో శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి


ఆలయ ప్రాంగణంలో జగద్గురు పీఠాధిపతి

శ్రీశైలం, ఆగస్టు 8: శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను గురువారం శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చెన్న సిద్ధ రామ శివాచార్య మహాస్వామి దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న స్వామీజీకి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజి ఆలయంలోనికి ప్రవేశించి మల్లికార్జు స్వామి వారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారికి అర్చనలు జరిపించుకున్నారు.

కొత్తూరులో శ్రావణ మాస పూజలు


సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈవో

పాణ్యం, ఆగస్టు 8: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రావణమాస, నాగుల చవితి పండుగను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామికి శ్రావణ పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయంలోలని నాగులకట్టకు మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. నాగుల విగ్రహాలకు పాలు, పూలు, నువ్వులపిండి, చలిపిండి, చీరె, సారెలు పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ స్వామి, సురేష్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

జలాశయంలో 13.505 టీఎంసీల నీరు

వెలుగోడు, ఆగస్టు 8: వెలుగోడు జలాశయానికి బానకచెర్ల సముదాయం నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీతో వెలుగోడు జలాశయ నీటి మట్టం రోజురోజుకు పెరుగుతోంది. గురువారం ఉదయం నాటికి జలాశయంలో 262.59మీటర్ల వద్ద 13.505 టీఎంసీల ఈనరు నిలువ ఉంది. ప్రస్తుతం జలాశయంలోకి బానకచెర్ల సముదాయం నుంచి 16800 క్యూసెక్కుల నీరు. వచ్చి చేరుతోంది. జలాశయం స్పిల్ వే నుంచి 3625వేల క్యూసెక్కులు, చెన్నై ప్రధాన కాలువకు 5 వేల క్యూసెక్కులు,వన్‌ఆర్ తూము ద్వారా 50, వన్‌ఎల్ తూము ద్వారా 30, నంద్యాల తాగునీటి పథకాలకు 15 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పల్స్ సర్వేపై సమీక్ష

నంద్యాల రూరల్, ఆగస్టు 8: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన మౌలిక వసతుల కల్పనలో భాగంగా పల్స్‌సర్వే కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు .గురువారం నంద్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో పల్స్ సర్వేలో గుర్తించాల్సిన అంశాలపై అయాశాఖల అధికారులతో చర్చించారు. పల్స్ సర్వే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి కొళాయిలు, గ్రామాలలో ఎన్నిగృహాలు ఉన్నాయి వాటిలో కుళాయి కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి, స్వచ్ఛమైన నీరు లభిస్తుందా? లేదా? వంటి వాటిపై కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపిడీవో తెలిపారు. సర్వే వివరాలు ఆగస్టు 14వ తేది లోపు సేకరించి తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిస్టెంట్‌లు పాల్గొన్నారు.

'మెరుగైన వైద్యం అందించాలి'

ఆత్మకూరురూరల్, ఆగస్టు 8: ఆసుపత్రులకు వచ్చే గిరిజనులకు సకాలంలో వైద్య సేవలందించి మెరుగైన వైద్యం అందించాలని నంద్యాల డీసీహెచ్ జఫ్రుల్లా అన్నారు. గురువారం ఆయన ఆత్మకూరు సామాజిక ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలతో ఆయన మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు రికార్డులను ఆయన తనిఖీ చేసి ఉద్యోగుల పని తీరుపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడిని అడిగి ఆరా తీశారు. ఎన్టీఆర్ వైద్య సేవలపై గిరిజనులకు అవగాహన కల్పించి ఎన్టీఆర్ వైద్య సేవలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ మృతి పట్ల ఆయన సంతాపం తెలిపారు. అంత్యక్రియల కోసం ప్రభుత్వం నుండి మంజూరైన రూ.25 వేలను వారి సతీమణికి అందించారు. ఆయన వెంట వైద్యాధికారి ప్రసన్న గైక్వాడ్, టీబీ సూపర్ వైజర్ మస్తానయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడు: ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల వైద్యాధికారులు వైద్య సిబ్బంది మర్యాదగా నడుచుకుని స్నేహ పూర్వకంగా మెలగాలని నంద్యాల డీసీహెచ్ జఫ్రుల్లా సూచించారు. గురువారం ఆయన వెలుగోడు సామాజిక ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవ ల్యాబ్ ,ఆఫీసులోని పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న డైట్ గురించి సంబంధిత కాంట్రాక్టర్ పిలిపించి ఆయన మాట్లాడారు. ప్రతి రోగికి నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. వైద్యాధికారులు విక్రమ్ అలిఖాన్, సింధు ప్రియ సాయి ప్రదీప్ సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల డీఎస్పీగా యుగంధర్‌బాబు

నంద్యాల క్రైం, ఆగస్టు 8: నంద్యాల డీఎస్పీగా ఎన్.యుగంధబాబును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా యుగంధర్‌బాబును నంద్యాల పట్టణ డీఎస్పీగా నియమించారు. ఆయన గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పలు స్టేషన్లలో ఎస్‌ఐగా, సీఐగా విధులు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నంద్యాల డీఎస్పీగా ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డిని నియమించిన విషయం విదితమే. ఎన్నికలు ముగిసిన అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డిని ఇటీవలే బదిలీ చేయగా ఆయన స్థానంలో సాధా రణ బదిలీల్లో భాగంగా యుగంధర్‌బాబును ఉన్నతాధికారులు నియమించారు.

'తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి'

నంద్యాల రూరల్, ఆగస్టు 8: రైతులు సాగుచేసే పొగాకు పంటలో సోకే తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాస్రవేత్తలు, అధికారుల సలహాలు తీసుకోవాలని ఆర్‌ఏఆర్‌ఎస్ ఇన్‌చార్జి శాస్త్రవేత్త శివరామకృష్ణ పేర్కొన్నారు. గురువారం నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో శాస్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు పుల్లిబాయి, ఇష్యాపర్వీన్, వెంకటరమణమ్మ, వీఏఏ లు పాల్గొన్నారు.

'వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 8: పార్లమెంట్‌లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వైసీపీ ఎంపీలు వ్యతిరేకించాలని, ఆ విధంగా ఆ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆదేశించాలని నంద్యాల ముస్లిం ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్లు షేక్ అబ్దుల్ సమ్మద్, మహ్మద్ అబులైస్ డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని క్రాంతి రేఖ గ్రంథాలయంలో వారు మాట్లాడారు. దేశంలోని వక్ఫ్ బోర్డుల పరిధిలోని ఆస్తులను ముస్లిం సంక్షేమానికి ఉపయోగించకుండా కొల్లగొట్టేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. వైసీపీకి చెందిన పార్లమెంట్, రాజ్యసభ ఎంపీలు ఈ బిల్లును వ్యతిరేకించాలన్నారు. మస్తాన్ అబుబకర్ సిద్దికి, ఇన్సాఫ్ బాబా ఫక్రుద్దీన్, ఫయాజ్, యునస్, ఇమాముల సంఘం నాయకలు పాల్గొన్నారు.

2 నుంచి చెత్త సంపద కేంద్రాల వినియోగం

కలెక్టరు రాజకుమారి


పాణ్యంలో గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

పాణ్యం, ఆగస్టు 8: అక్టోబరు 2వతేదీ నుంచి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని జిల్లా కలెక్టరు రాజకుమారి ఆదేశించారు. పాణ్యం మండలంలోని పాణ్యం, బలపనూరు గ్రా మాలలోని చెత్త సంపద కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాణ్యంలోని కేంద్రంలో జరిగే పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీన్ అంబాసిడర్స్‌తో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రీన్ అంబాసిడర్స్‌కు వేతనాల మంజూరులో జాప్యం ఏర్పడుతుందని అంబాసిడర్స్ పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది పనీతీరుపై విచారించారు. చెత్త సేకరణ నిర్వహణ, వినియోగంపై ఎంపీడీఓ భాగ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. చెత్త నిల్వల నిర్వహణపై ఈఓపిఆర్‌డీ సులోచనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బలపనూరులోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం ఎందుకు పనిచేయడం లేదని సిబ్బందిని అడిగారు. దీనికి ఈఓపిఆర్‌డీ సమాధానమిస్తూ నిధుల కొరతతోపాటు సిబ్బంది వేతనాల సమస్య ఉందన్నారు. చెత్త సంపద కేంద్రాలను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని ఇందుకు తగిన చర్యలు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారా అని గ్రామంలోని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. వడ్డుగండ్ల సమీపంలోని శిథిలమైన వాగు వివరాలను తెలుసుకున్నారు. దీనికి ఎంపీడీఓ మాట్లాడుతూ గతంలో వాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారై నిధులు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి మంజుల వాణి, ఎంఈవో సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా సుభద్రమ్మ బాధ్యతలు

పాములపాడు, ఆగస్టు 8: పాములపాడు మండల తహసీల్దార్‌గా జి సుభద్రమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ గతంలో చాగలమర్రిలో విధులు నిర్వర్తించానని, ఎన్నికల ముందు చేపట్టిన బదిలీలలో చిత్తూరు జిల్లాకు బదిలీ అయినట్లు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, నాయకులు గోవింద్ పూసల కృష్ణ, సురేశ్, అర్జున్‌గౌడ్ నూతన తహసీల్దార్‌ను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. సిబ్బంది తహసీల్దార్‌కు స్వాగతం పలికారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 8: రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో ప్రతిబ కనబర్చి పథకాలు సాధించారని తైక్వాండో ఉమ్మడి జిల్లాల కార్యదర్శి అబ్దుల్ మజీద్ గురువారం తెలిపారు. ఆగస్టు 2,3,4 తేదీలలో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన 42వ సబ్‌జూనియర్స్, 7వ క్యాడేట్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో పల్లవి, మౌనిక బంగారు పథకం, అతిథి మహ్మద్ రయ్యాన్ రజత పథకం, సింధు, బాను తేజ్ రెడ్డి, కాంస్య పథకాలు, క్యాడెట్ విభాగంలో నీరజ, రజత పథకం మహ్మద్ అమ్జాద్, రాఘవేంద్ర కాంస్య పథకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. బంగారు పథకాలు సాధించిన క్రీడాకారులు సెప్టెంబర్ 5,6,7 తేదీలలో ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.టోర్నమెంట్‌లో మసూం సాకిబ్, సతీష్‌కుమార్‌లు కోచ్‌లుగా ఖజా హుసేన్ మేనేజర్‌గా వ్యవహిరంచినట్లు చెప్పారు పథకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు.

గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పనపై శిక్షణ

ఆత్మకూరు రూరల్, ఆగస్టు 8: గ్రామాల్లో ఉన్న వనరులను వినియోగించుకుని గ్రామ పంచాయతీల అభివృద్దే లక్ష్యంగా, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, పంచాయకార్యదర్శులకు మూడు రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో శివప్రసాద వర్మ, ఈవోఆర్డీ మోహన్‌కుమార్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 12 నుంచి 14 వ తేది వరకు మూడు రోజులు పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో ఆర్జీసీఏ పై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయడంతో గ్రామాల్లోని వనరులను వినియోగించుకుని గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పడే అంశాలను చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పట్టణంలోని ఎంపీడీవో సమావేశభవనంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమా నికి ఆయా గ్రామాల పంచాయతి కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రభుత్వ ఆదేశాల మేరకు తప్పక హాజరు కావాలని కోరారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల నిర్మాణం, నిర్వహణ, పన్నులు వసూలు చేయడం, గ్రామానికి ప్రభుత్వ పథకాలు ఎలా వర్తింపజేయాలన్న అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

'సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి'

ఆత్మకూరురూరల్, ఆగస్టు 8: వరి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ ఆంజనేయ, మండల వ్యవసాయాధికారివిషుణవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సంజీవ్‌నగర్ తండా గ్రామంలో గురువారం క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేసిన వరి పంటలను పరిశీలించి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు,ప్రకృతి వ్యవసాయసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'కొలతల్లో మోసం చేస్తే కఠిన చర్యలు'

గడివేముల, ఆగస్టు 8: వినియోగదారులను తూనికలు, కొలతలలో మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అనిత హెచ్చరించారు. మండల కేంద్రంలో గురువారం ఆమె ఫర్టిలైజర్ దుకాణాలు, సంత మార్కెట్‌లోని దుకాణాలను, కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాటాలను పరిశీలించారు.

శ్రీశైలంలో నాటుసారా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సారాతో పోలీసులు

శ్రీశైలం, ఆగస్టు 8: ప్రకాశం జిల్లా, దోర్నాల నుంచి శ్రీశైలానికి నాటు సారాను తరలిస్తున్న నలుగురు మహిళలను గురువారం అదుపులోనికి తీసుకు న్నారు. వివరాలు ఇలా.. శ్రీశైలానికి నాటు సారాను తరలిస్తున్నారనే సమా చారంతో గురువారం శ్రీశైలం సీఐ ప్రసాదరావు, ఎస్ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి శ్రీశైలం క్షేత్రపరిధిలోని వాసవీ సత్రం సమీపంలో నలుగురు మహిళలను అదుపులోనికి తీసుకుని తనిఖీలు చేయగా 13 లీటర్ల నాటు సారాను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించారు.

యువకుడి ఆత్మహత్య

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 8: నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో చంద్రకంటి ప్రసన్నకుమార్(25) ఆత్మహత్య చేసుకున్నారు. నందికొట్కూరు ఏఎస్ఐ రఘురామయ్య తెలిపిన వివరాలివీ.. బ్రాహ్మణకొట్కూరు గ్రామం కల్వరికొండ వీధికి చెందిన చంద్రకంటి ప్రసన్నకుమార్ కడుపు నొప్పి తాళలేక అనారోగ్యంతో గురువారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆయన తండ్రి చంద్రకంటి నాగన్న చెప్పారు. బుధవారం ఆసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్యం చేయించుకుని తీసుకువచ్చారు. అయితే కడుపునొప్పి తగ్గక పోవడంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వురివేసుకుని ఆత్మహత్యకు పాలడ్డాడని తెలిపారు. అతని కి ఇంకా వివాహం కాలేదన్నారు. మృతిడి అన్న చంద్రకంటి స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

'విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలి'

పాములపాడు, ఆగస్టు 8: విద్యార్థినులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, కాశీంవలి సూచించారు. గురువారం పాములపాడులోని కేజీబీవీలో వంటగది సరుకు నిల్వలు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించి ప్రిన్సిపాల్ రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థినుల్లో రక్తహీనత లేకుండా చర్యలు చేపట్టాలని, వారికి అందించే ఆహారం పట్ల శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తుందని అన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బియ్యం, కూరగాయలను పరిశీలించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నంద్యాల జిల్లాలో నాగుల చవితిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల్లో, నాగదేవత విగ్రహాలకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులమ్మకు చీరలు, నైవేద్యంగా పిండి పదార్థాలు, కాయకర్పూరం సమర్పించారు. నాగుల కట్టల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే శివాలయాల్లో కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


మహానందిలో..


పాణ్యంలో..


నంద్యాలలో బంగారుపుట్ట వద్ద పుట్టకు పాలు పోస్తున్న భక్తులు


కానాలలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


ఆత్మకూరులోని నాగులకట్ట వద్ద..


వెలుగోడులో..


పగిద్యాలలో..


నందికొట్కూరులో..

డోన్ తహసీల్దార్‌గా సత్యదీప్

డోన్, ఆగస్టు 8: డోన్ తహసీల్దార్‌గా సత్యదీప్ గురువారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న సత్యదీప్‌ను ఫుల్ అడిషనల్ చార్జ్‌తో తహసీల్దార్‌గా సత్యదీప్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ సత్యదీప్ మాట్లాడుతూ అందరి సహకారంతో డోన్ మండలంలో భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సేవలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా సత్యదీప్‌ను డిప్యూటీ తహసీల్దార్ మధుసుధాకర్, సర్వేయర్ జగదీష్, వీఆర్వోలు సన్మానించారు.

బేతంచెర్ల తహసీల్దార్‌గా సూర్యప్రకాష్ బాబు

బేతంచెర్ల, ఆగస్టు 8: బేతంచెర్ల తహసీల్దార్‌గా సూర్యప్రకాష్ బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. బేతంచెర్ల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జీవన్ చంద్రశేఖర్ కడప జిల్లా చెన్నూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సూర్యప్రకాష్ బాబును నియమించారు. సూర్యప్రకాష్ బాబుకు రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఏవోలు, ప్రభుత్వ చౌక దుకాణాల డీలర్లు ఆయన్ను సన్మానించారు. ఈయన మిడుతూరు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికలకు ముందు కడప జిల్లా చెన్నూరుకు బదిలీ చేశారు. జీవన్ చంద్రశేఖర్ చెన్నూరుకు బదిలీ కావడంతో బేతంచెర్ల తహసీల్దార్‌గా సూర్యప్రకాష్ బాబును అధికారులు నియమించడంతో గురువారం బాధ్యతలు చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కోవెలకుంట్ల, ఆగస్టు 8: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ పోటీలకు జ్యోతి విద్యానికేతన్ స్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సవిత్‌నాథరెడ్డి, ప్రిన్సిపాల్ సింధూరి తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు శరత్‌కుమార్‌రెడ్డి, తేజాకిరణ్, హేమంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, హేమచంద్రుడు, త్రినాథరెడ్డి జూలై 8న నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పరమేశ్వరరెడ్డి, నాగార్జున, స్మృతి, సురేశ్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల సీఐగా హనుమంతనాయక్



కోవెలకుంట్ల, ఆగస్టు 8: కోవెలకుంట్ల సీఐగా హనుమంతనాయక్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ జయచంద్ర బదిలీ కావడంతో హనుమంతనాయక్‌ను కోవెలకుంట్లకు బదిలీ చేశారు. గురువారం ఉదయం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఈయనకు ఎస్ఐ, పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ఆళ్లగడ్డ, ఆగస్టు 8: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వ్యాపారాలు రూ.47వేల కోట్లు దాటాయని, ఖాతాదరులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆ బ్యాంకు ఛైర్మన్ సత్యప్రకాశ్ సింగ్ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రధాన ఏపీజీబిలో గురువారం సరళ రుణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఛైర్మన్ మాట్లాడుతూ ఇతర వాణిజ్య బ్యాంకుల మాదిరిగా వినియోగదారులకు గృహ, వ్యాపార, విద్య తదితర రుణాలు అందుబాటులో ఉంచామని, ఇతర బ్యాంకుల మాదిరిగా ఫ్లోటింగ్ వడ్డీ కాకుండా ఫిక్స్‌డు వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నంద్యాల రీజనల్ మేనేజర్ పీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

'మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి'

చాగలమర్రి, ఆగస్టు 8: మండలంలోని రైతులు మినీ గోకులాకు దరఖాస్తులు చేసుకోవాలని పశుసంవర్థశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలానికి 25, ఉయ్యాలవాడ మండలానికి 25 మినీ గోకులాలు మంజూరయ్యాయని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు అప్లికేషన్ ఫారం, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంకు పాసు బుక్‌లతో దగ్గరలోని పశువైద్యశాలలో గానీ, రైతు సేవా కేంద్రంలో గానీ సంప్రదించాలని తెలిపారు.

యాగంటిలో వేలం పాట వాయిదా

బనగానపల్లె, ఆగస్టు 8: బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో ఈనెల 14న నిర్వహించవలసిన వేలం పాటలు వాయిదా వేసినట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకోవడం, తలనీలాలు పోగుచేసుకోవడం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవడం, పండ్లు, బొమ్మలు, ఐస్‌క్రీంలు అమ్ముకోవడం మొదలైన వాటికి వేలం పాటలు వాయిదా వేశామని తెలిపారు. ఈనెల 28న తిరిగి వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

'స్వాతంత్ర్య సమరయోధులను మరువకూడదు'

ఆళ్లగడ్డ, ఆగస్టు 8: భారత స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలకమని, స్వాతంత్ర్య సమరయోధులను మరువకడదని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల జిల్లా అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో 83వ క్విట్ ఇండియా ఉద్యమం పురస్కరించుకొని పాఠశాలల విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ సంఘం కోశాధికారి షర్ఫుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి కొళాయిపై ఇంటింటి సర్వే చేయండి

కోవెలకుంట్ల, ఆగస్టు 8 : గ్రామాల్లో తాగునీటి కొళాయిలపై ఇంటింటి సర్వే చేసి రిపోర్టు తయారు చేయాలని ఎంపీడీవో సయ్యదు న్నీసా ఆర్‌డబ్ల్యూఎస్ హరి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 8 నుండి 14 లోపు గ్రామాల్లో ఇంటింటి సర్వే పూర్తి చేసి తాగునీటి కొళాయిలపై సర్వే చేసి రిపోర్టు తయారు చేయాలన్నారు.

అక్రమ మద్యంపై చర్యలు తీసుకోవాలి

డోన్(రూరల్), ఆగస్టు 8: అక్రమ మద్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అనంతపురం డిప్యూటీ కమిషనర్ విజయకుమార్ సూచించారు. గురువారం డోన్ సెబ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెబ్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ క్రైం రేటు తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● **మద్యం స్వాధీనం :** మండలంలోని చింతలపేట గ్రామంలో రమేష్ అనే వ్యక్తి అక్రమ మద్యం కలిగి ఉండగా.. సెబ్ అధికారులు దాడులు చేసి అతని నుంచి 11 బీర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే అక్రమంగా పట్టణంలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌కు రూ.25వేలు జరిమానా విధించారు.

'న్యాయ పోరాటం చేస్తాం'

డోన్(రూరల్), ఆగస్టు 8: డోన్ మండలం సోంపురం గ్రామ ప్రధాన రోడ్డులో తన పొలం భూభాగం సంబంధించిన విషయంలో న్యాయం జరిగేంత వరకు న్యాయ పోరాటం చేస్తామని రైతు వెంకటేశ్ తెలిపారు. సోంపురం గ్రామ ప్రధాన రోడ్డులో ఉన్న రైల్వే ట్రాక్ కింద రైల్వే అండర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. అండర్ బ్రిడ్జి దారిగుండా తనకున్న పొలంలో కొంత భూభాగం ప్రధాన దారిలోకి వెళ్లిందని ఆరోపిస్తూ రైతు వెంకటేశ్ కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. అధికారులు తాను కోల్పోతున్న భూమికి నష్టపరిహారం ఇవ్వాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కారం

కోవెలకుంట్ల, ఆగస్టు 8 : కోవెలకుంట్ల మండల పరిధిలోని గుల్లదుర్తి గ్రామంలోని బీసీ బాలుర హాస్టల్‌లో నెలకొన్న సమస్యను సర్పంచ్ కొర్ర శ్రీలత, పంచాయతీ కార్యదర్శి శారద, ఈవోపీఆర్‌డి రాధిక కలిసి పరిష్కరించారు. హాస్టల్‌లో నిండిన మరుగుదొడ్ల గుంతలను వీటిని తొలగించేందుకు హాస్టలు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు సిబ్బంది కలిసి సర్పంచ్ శ్రీలతను కలిసి సమస్య పరిష్కరించాలని కోరారు. దీంతో సర్పంచ్ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి శారద, వార్డెన్ కలిసి ఈవోపీఆర్‌డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించి హాస్టల్‌లో నిండిపోయిన సెప్టిక్ ట్యాంకులను వాహనంతో శుభ్రం చేయించారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

శిరివెళ్ల, ఆగస్టు 8: ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవోలు డీటీ శంకర్ ప్రసాద్, నాగార్జునరెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని 29 ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఐదు జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు శిరివెళ్లలోని మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో యాజమాన్య కమిటీ సభ్యులను, అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు వనికెందిన్నెలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కోరం లేకపోవడంతో కమిటీ ఎన్నికల ప్రక్రియను వాయిదా వేసినట్లు ఎంఈవోలు వెల్లడించారు.

చాగలమర్రి: మండలంలోని 36 ప్రాథమిక పాఠశాలలు, 9 ఉన్నత పాఠశాలలు, 2 యూపీ పాఠశాలలకు గురువారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో అనూరాధ తెలిపారు. గురువారం 35 ప్రాథమిక పాఠశాలల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష సభ్యుల పదవులను టీడీపీ నాయకులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో ఎన్నిక వాయిదా పడిందని చెప్పారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో 56 పాఠశాలలు ఉన్నాయి. వీటికి గురువారం ఎస్ఎంసీ కమిటి సభ్యులను ఎన్నుకున్నట్లు ఎంఈవో-2 లక్ష్మి తెలిపారు. 56 మంది ఛైర్మన్లు, 56 మంది వైస్ ఛైర్మన్లను, 813 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఎంఈవో తెలిపారు.

దొర్నిపాడు: మండలంలోని 23 ఎంపీపీఎస్, 3 జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల్లో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈవో రామచంద్రయ్య తెలిపారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులకు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు చెప్పారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలోని 36 ప్రభుత్వ పాఠశాల ల్లో స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ ఛైర్మన్ వైస్ ఛైర్మన్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవో వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం10 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు తరగతుల వారీగా నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటలకల్లా అన్ని పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

ప్యాపిలి: మండలంలోని పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 64 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు గాను గోపాల్‌నగరం ప్రాథమిక పాఠశాలలో కోరం లేక ఎన్నిక నిలిచిపోగా మిగతా అన్ని పాఠశాలల్లో కూడా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాధికారి వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలోని మొత్తం 78 పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎంఈవో స్వరూప గురువారం తెలిపారు. మండలంలోని 54 ప్రాథమిక, 15 హైస్కూల్, 9 ప్రాథమికోన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవం గా ఎన్నికైనట్లు తెలిపారు.

డోన్(రూరల్): డోన్ పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌గా దుల్హాత్, వైస్ ఛైర్మన్‌గా లలితలు ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌లో ఛైర్మన్‌గా ఖాజా హుశేన్, వైస్ ఛైర్మన్‌గా రామలక్ష్మి ఎన్నికైనట్లు హెచ్ఎం రామనరసప్ప తెలిపారు. మోడల్ స్కూల్ ఎన్నికల్లో ఛైర్మన్‌గా వెంకటసుబ్బయ్య, వైస్ ఛైర్మన్‌గా ఆర్.లలిత ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ నాగజాస్మిన్ తెలిపారు.

● మండలంలోని పలు గ్రామాల్లో ప్రశాంతంగా పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలు జరిగాయి. మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలకు జరిగిన ఎన్నికల్లో ఛైర్మన్‌గా లద్దగిరి మక్బూల్, మండల పరిషత్ పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో ఛైర్మన్‌గా లద్దగిరి మిన్నెల్లలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బేతంచెర్ల: మండలంలోని అన్ని గ్రామాలతోపాటు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ, ఉన్నత పాఠశాలల్లో 53 పాఠశాలలో విద్యాకమిటీ ఛైర్మన్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో సోమశేఖర్, జనార్దన్‌గౌడు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం తెలిపారు. మొత్తం 59 పాఠశాలల్లో 5పాఠశాలలు మినహా ఎస్ఎంసీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అవుకు: అవుకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎమ్‌సీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీధర్‌రావు మాట్లాడుతూ మండలంలో ప్రాథమిక పాఠశాలు 32, ప్రాథమికోన్నత 3, ఉన్నత పాఠశాలలు 13 మొత్తం 48 పాఠశాలల్లో ఎస్ఎమ్‌సీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సంజామల: మండల వ్యాప్తంగా 30 ప్రాథమిక 4 ప్రాథమికోన్నత , 8 ఉన్నత, 1 కస్తూర్బా బాలిక పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అన్ని పాఠశాలల్లో టీడీపీ మద్దతు దారులే ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌గా ఎంపికయ్యారు.

ఆళ్లగడ్డ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. టీడీపీ బలపరచిన అభ్యర్థులే ఎక్కువ శాతం మంది ఎన్నికయ్యారు.

ఉయ్యాలవాడ: మండలంలో 32 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గురువారం 30 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. ఎంఈవో ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ నర్సిపల్లెలోని ప్రాథమిక పాఠశాల, పెద్దయమ్మనూరులోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా వేశామని చెప్పారు.



చాగలమర్రి బాలుర పాఠశాలలో ఏకగ్రీవంగా ఎంపికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులతో టీడీపీ నాయకులు



బనగానపల్లె జడ్పీ ఉన్నతపాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నికైన విద్యాకమిటీ ఛైర్మన్లు, ఉపాధ్యాయులు



ఆలమూరులో ఎన్నికైన కమిటీ సభ్యులతో టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

నంద్యాల జిల్లాలో నాగుల చవితిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల్లో, నాగదేవత విగ్రహాలకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులమ్మకు చీరలు, నైవేద్యంగా పిండి పదార్థాలు, కాయకర్పూరం సమర్పించారు. నాగుల కట్టల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే శివాలయాల్లో కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



ఉయ్యాలవాడలో నాగులకట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



చాగలమర్రి ఆలయంలో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు



అవుకులో


మంత్రి బీసీ చొరవతో 'విద్యార్థి బస్సు'



విద్యార్థి బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 8: రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో మండలంలోని ఉమ్మాయిపల్లె గ్రామ విద్యార్థు లకు బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. గురువారం టీడీపీ సీనియర్ నేత ఐవీ పక్కీరారెడ్డి, ఇటిక్యాల బాలిరెడ్డి, అంబటి జయల క్ష్మీరెడ్డి, పుల్లిపకా శిరెడ్డిలు ఉమ్మాయిపల్లె నుంచిపెన్నా స్కూల్‌కు వెళ్లే విద్యార్థి బస్సును ప్రారంభించారు. గ్రామ నాయకులు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ ఆదినారాయణరెడ్డి, కత్తి నాగిరెడ్డి, శేఖర్‌యాదవ్‌లు విద్యార్థి బస్సు కోసం మంత్రి బీసీ, ఐవీ పక్కీరెడ్డిని సంప్రదించగా వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారని అన్నారు. కార్యక్రమంలో కామిని భాస్కరరెడ్డి, రవ్విపకా శిరెడ్డి, నంద్యాల ప్రసాదు, సుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.2లక్షల ఆస్తి నష్టం



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన కుట్టుమిషన్ షాపు

కోవెలకుంట్ల, ఆగస్టు 8: కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో టైలరు రాజు షాపులో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో షాపుతో పాటు, అందులో ఉన్న వస్త్రాలు, దుస్తులు కుట్టుమిషన్లు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరిగి ఉంటుందని షాపు యజమాని షేక్ బాషా తెలిపారు. గోవిందిన్నె గ్రామానికి చెందిన షేక్ బాషా తన భార్యతో పాటు కలిసి గత కొన్నేళ్లుగా పట్టణంలో కుట్టుమిషన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగా షాపుకు వీవోపీ చేయించారు. నిన్నరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో షాపు కాలిపోయింది. దీనిపై ఆధారపడి జీవిస్తున్న షేక్ బాషా కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రేపు అవుకుకు మంత్రి బీసీ రాక

అవుకు, ఆగస్టు 8: రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం జలహారతి కార్యక్రమంలో పాల్గొనేందుకు అవుకుకు రానున్నట్లు ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గోరుకల్లు నుంచి జీఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా, ఎస్సార్బీసీ కాల్వ ద్వారా అవుకు రిజర్వాయర్‌కు నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.148 టీఎంసీలు కాగా 10వతేదీ నాటికి రిజర్వాయర్‌లో 3 టీఎంసీలకు పైగా నీరు చేరుకొనే అవకాశం ఉండటంతో జలహారతి కార్యక్రమంలో మంత్రి బీసీ పాల్గొంటారని తెలిపారు.

సోదరికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కోట్ల

డోన్, ఆగస్టు 8: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సోదరి వరలక్ష్మి మృతితో ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. కోట్ల సోదరి వరలక్ష్మిని సినీ నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. హైదరాబాదులోనే వారు స్థిరపడ్డారు. అనారోగ్యంతో ఆమె మృతి చెందింది. గురువారం హైదరాబాదులోని సినీ నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి నివాసంలో ఆమె భౌతిక కాయానికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ, తనయుడు రాఘవేంద్రరెడ్డి, కుమార్తెలు నివేదిత, కోట్ల చిత్రమ్మలు నివాళులర్పించారు. డోన్ నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కోట్లకు సానుభూతి తెలిపారు.

'వర్షాలతో పంటలకు ఊరట'

ఆళ్లగడ్డ, ఆగస్టు 8: ఆళ్లగడ్డ ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగు చేసిన పంటలకు ఊరట కలిగిందని ఏడీఏ రామ్మోహనరెడ్డి అన్నారు. ఆళ్లగడ్డలో గురువారం సాయంత్రం వర్షం కురవటంతో మొక్కజొన్న, మినుము పంటలకు మంచిదని అన్నారు. గత నెలలో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు ఆందోళన చెందా రని, అయితే ఈనెలలో కురుస్తున్న వర్షాలు పంటలకు మేలు చేస్తాయని అన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

డోన్(రూరల్), ఆగస్టు 8: పట్టణంలోని 19, 21, 23 అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్లు అరుణ్‌కుమార్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ కరీముల్లా క్షయవ్యాధి లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

బేతంచెర్ల సీఐని కలిసిన టీడీపీ నాయకులు

బేతంచెర్ల, ఆగస్టు 8: మండలంలోని గూటుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముల్లా బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా గురువారం కలిసి శాలువ, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రిలో కుండపోత వర్షం



చాగలమర్రిలో జలమయమైన గాంధీ సెంటర్

చాగలమర్రి, ఆగస్టు 8: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం కుండపోత వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీటి కుంటలను తలపించాయి. దేవాలయాలు, పాఠశాలలు, వైద్యశాలల ప్రాంగణాలు జలమయమయ్యాయి. మద్దూరు, మల్లేవేముల, బ్రాహ్మణపల్లె, గొట్లూరు, చింతలచెరువు, చిన్నవంగలి, పెద్దవంగలి, చాగలమర్రి తదితర గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, కంది, వేరుశనగ పంటలకు వర్షం ప్రాణం పోసింది.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో గురు వారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. గత నెల రోజులుగా వాన లేకపోవడంతో మండలంలోని గ్రామాల్లో పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గురువారం కురిసిన చిన్నపాటి వర్షం సాగు చేసిన పంటలకు కొంతైనా ఊరటనిస్తుందని అన్నదాతలు భావిస్తున్నారు.

డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా పదోన్నతి

రుద్రవరం, ఆగస్టు 8: రుద్రవరం రేంజ్‌లోని డి.వనిపెంట ఫారెస్టుసెక్షన్ ఆఫీసరుగా పనిచేస్తున్న శ్రీనివాసులనాయుడుకు డిప్యూటీ రేంజర్‌గా పదోన్నతి లభించినట్లు గురువారం రేంజర్‌శ్రీపతినాయుడు తెలిపారు. డిప్యూటీ రేంజర్‌గా కడప ఫారెస్టు డివిజనులోని ముద్దనూరు రేంజ్ ముద్దనూరు సెక్షన్ పదోన్నతిపై వెళ్లారని చెప్పారు. డీవీ పెంట ఇన్‌చార్జి సెక్షన్ ఆఫీసరుగా ఆలమూరు సెక్షన్ ఆఫీసరు ముక్తర్‌బాషాకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు రేంజర్ తెలిపారు.

రోడ్డు అంచు తొలగింపు

ఉయ్యాలవాడ, ఆగస్టు 8: మండలంలోని ఎస్.కొత్తపల్లె గ్రామం సమీపంలో ఆర్ అండ్ బీ రహదారి ఓ వైపు ఉన్న అంచును గ్రామానికి చెందిన ఓ రైతు తొలగించారు. మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్ల సహాయంతో అంచును దాదాపుగా వంద మీటర్ల మేర తొలగించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో వాహన రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. దీనిపై ఆర్ అండ్ బీ సునీల్ రెడ్డిని వివరణ కోరగా బర్రొంచు తొలగించిన రైతుకు రెండు రోజులు గడువు ఇచ్చామని, రెండు రోజుల్లో తిరిగి ఏర్పాటు చేయకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా జియారత్ వేడుక



రెడ్డిపల్లెలో స్వామివారి పీర్ల గ్రామోత్సవం

సంజామల, ఆగస్టు 8: మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో కొలువుదీరిన దస్తగిరి మౌలా అలి స్వామి వారి పీర్లకు జియారత్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామ టీడీపీ నాయకుడు మాయలూరి పెద్ద సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలు, హిందువులు ఈ వేడుకలను జరుపుకున్నారు. స్వామి వారి పీర్లను బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లారే వరకు గ్రామంలో ఊరేగించి తిరిగి చావిడిలలో కొలువుదీర్చారు.

సమస్యాత్మక గ్రామాల్లో అడిషనల్ ఎస్పీ తనిఖీ



పోలీసులకు సూచనలిస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్

డోన్(రూరల్), ఆగస్టు 8: మండలంలో సమస్యత్మాక గ్రామాల్లో జరుగుతున్న పాఠశాలల యజమాన్య కమిటీ ఎన్నికలను అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ తనిఖీలు చేశారు. మండలంలోని గోసానుపల్లె, ఓబులాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఎన్నికల తీరును పరి శీలించి అక్కడ పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే వెంకటనాయునిపల్లె గ్రామంలో పోలీస్ పికెటింగ్‌ను తనిఖీ చేసి గ్రామాల్లో గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీసులకు పలు సూచనలు చేశారు.

వైభవంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ

చాగలమర్రి, ఆగస్టు 8: చాగలమర్రి గ్రామంలోని కుమ్మరి వీధిలో గురువారం నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం వేద పండితుడు ఆనంద్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహాలకు జల, క్షీరాభిషేకాలు, గణపతి, రుద్రాభిషేక హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, బీసీ సంఘం మాజీ అధ్యక్షుడు రామతీర్థం, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, దాతలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

సంజామల, ఆగస్టు 8: ప్రభుత్వ అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెండేకంటి కిరణ్ కుమార్ అన్నారు. గురువారం సంజామల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అనిల్ కుమార్‌ను పెండేకంటి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీటీసీ యూసుఫ్ హుసేన్, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు మల్కి హుసేన్, తోకల మద్దిలేటి, వెంకటేశ్వర్లు, రెడ్డి మగ్బుల్, నాగమల్లేష్ పాల్గొన్నారు.

తహసీల్దారును కలిసిన టీడీపీ నాయకులు

రుద్రవరం, ఆగస్టు 8: రుద్రవరం తహసీల్దారుగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కె.మల్లికార్జునరావును గురువారం మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దారుతో పాటు డిప్యూటీ తహసీల్దారు రవీంద్రప్రసాద్‌ను పూలమాలతో సత్కరించారు. టీడీపీ నాయకులు రంగనాయకులు, పోలా గురుమూర్తి, శేఖర్, ఓబులయ్య, బికారి సాహెబ్, దస్తగిరి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీకాంత్, బండారు బాలరాజు, ఫక్కీరయ్యగౌడ్, నాగభూషణ్‌రెడ్డి, రామయ్య, మాజీ సర్పంచ్ నరసింహుడు ఉన్నారు.

పంట నమోదు తప్పనిసరి

దొర్నిపాడు, ఆగస్టు 8: మండలంలోని ఆయా గ్రామాల్లో ఖరీఫ్‌లో పంట సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి సునీత సూచించారు. మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామంలో ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము పంటను గురువారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఏఈవోలు, సిబ్బంది ఉన్నారు.

అవుకు: మండలంలో రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ అన్నారు. గురువారం అవుకులో వ్యవసాయ సహాయకులు చేస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఉమాదేవి, సింధియా, మధు, రైతులు పాల్గొన్నారు.